# జాతీయ సేవ



పాలడుగు వెంకటేశ్వరరావు

గాంధీపార్కు- ఆ రోజు జనంతో కిటకిట లాడ్తుతున్నది.

మామిడి చెట్ల క్రింద యువకులు గుంపులు గుంపులుగా చేరి నిరీక్షిస్తూ వున్నారు. శనగప్పు, బఠానీలు అమ్మే కుర్రాళ్ళు హడావుడిగా బేరసారాలు సాగిస్తున్నారు. నాలుగయిదు వూర కుక్కలుసందడిగా అటు ఇటు తిరుగుతూ వున్నాయి. బాగా ఎండ ఎక్కింది.

'నేషనల్ సర్వీస్'లో యువకుల్ని చేర్చుకోవటానికి ఆ రోజు, సెలక్షన్ జరుగుతుంది. అఖిలభారతస్థాయి 'సెలక్టు కమిటీ' అధ్యక్షుడయిన డోంగ్రేగారు రావాలి. ఆయన హైదరాబాదునించి ఏక్షణాన్నయినా రావాలి. ఆయనకోసమే ప్రాంతీయ కమిటీ మెంబర్లు 'కాన్ఫరెన్సు హాలు' లో కూర్చుని నిరీక్షిస్తూ వున్నారు. ఆయన ఏక్షణంలోనయినా

వచ్చి ఈ సెంటర్లో పని ముగించుకుని రేపటికల్లా వైజాగు సెంటరుకి వెళ్ళి పోతారు అనుకుంటున్నారు.

అందువలన అందరూ ఆయనకోసం ఎదురు తెన్నులు చూస్తూ వున్నారు.

ఇంకా ఆయన రాలేదు మరి!

ఆ అందరికీ కాస్త ఎడ్డంగా కూర్చుని తనూ నిరీక్షిస్తున్నాడు సుబ్బారావు. సుబ్బారావు ఐదుసంవత్సరాల క్రితమే బి.ఏ. పాసయ్యాడు. సుబ్బారావుకి పర్సనాల్టీ లేదు. అందగాడు కాదు, మాట కారీకాదు. సుబ్బారావుది పెద్దకుటుంబం. అతను అందర్లోకి చిన్నవాడు. అతని అన్నలందరూ పెళ్ళిళ్లు చేసుకుని వుద్యోగాల్లో వున్నారు. సుబ్బారావు బి.ఏ. అయేటప్పటికి అతని తండ్రి రిటయిరయి చితికిపోయాడు. పెరిగిన ధరలకు, వచ్చే పెన్షను రాళ్ళు, సరిపోక తిండి గడవటమే భారంగా అయింది. అందువలన నిరుద్యోగిగా తిరుగుతున్న సుబ్బారావుని అతని తండ్రి— బాధతోనే అయినా — తూష్ణీకరించి మాట్లాడటం సాగించాడు. తల్లి దిగులుపెట్టుకుంది. సుబ్బారావుకి వుద్యోగం గగనకుసుమమే అయింది.

'నేషనల్ సర్వీస్' కేవలం సేవా భావంతో మొదలయిన సంస్థ. రోడ్లు వెయ్యటం, మురికివాడలని తొలగించటం నిరక్షరాస్యతా నిర్మూలన, వ్యాధిగ్రస్తుల సేవ వంటి కొన్ని ముఖ్యమయిన వృత్తిశ్యాలని కలిగినది. ధర్మనిరతిని గలిగిన ఐశ్వర్యవంతుల విరాళాల వలన కార్యక్రమాన్ని నడుపుతూ, కార్యకర్తలను మెయింటెయిన్ చేస్తూ స్వల్పంగా మాత్రమే ప్రతిఫలం ముట్టచెప్తుందని అక్కడ చేరిన అందరితోబాటు సుబ్బారావుకి తెలుసును. ప్రళయ రాక్షసిలాగ విజృంభించిన నిరుద్యోగ సమస్యకి బలిఅయి, ఆత్మగౌరవంతో పాటు ఆస్తిత్వాన్నికూడా కోల్పోయే విపరీత పరిస్థితి నుంచి తప్పించుకోవాలన్న సంకల్పంతోనే అక్కడికి వచ్చిన ప్రదేశంలోని యువజనం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.

అంతలోనే కలకలం చెలరేగింది. జనంలో ఆత్రుత పెరిగింది.

ఒక కారువచ్చి కాన్ఫరెన్సు హాలు ముందు ఆగింది. నలుగురు పెద్దలు దిగి లోపలికి వెళ్ళారు. ఇంటర్వ్యూ మొదలయిందనుకుంటున్నారు యువకులు కంగారుపడ్తూ.

సరిగ్గా అప్పుడే—

ఒక బవిరిగడ్డంవాడు, బక్కచిక్కిన వాడు, లోతుకనులవాడు, ఎముకల పోగువంటి ఒకభిక్షకుడు అడుక్కుంటూ కళ్ళుతిరిగి పడిపోయాడు. ఆ యువకులందరిమధ్యా.

సుబ్బారావు అది చూసి అతనివద్దకు పరుగెత్తుకుని వెళ్లాడు. అతన్ని లేపి కూర్చోబెట్టాడు. ఆ ప్రక్కనేవున్న

పైపుదగ్గర్నుంచి నీళ్లుతెచ్చి మొహాన్న చల్లాడు. కాసినినీళ్ళు తాగించి తనజేబులో వున్న ఒక రొట్టెముక్కని తినిపించాడు, అతనిచేత.

మిగతా యువజనం అంతా ఎవరి గొడవలో వారున్నారు. ఆ దృశ్యాన్ని అంతా చూసినా ఎవరికీ పట్టించుకునే ఓపికలేకపోయింది. డొంగ్రేగారు వచ్చారంట. ఇంటర్వ్యూలు మొదలయాయి! సెలక్టవాలి! ప్రతి యువకుడూ ఇదే ఆదుర్దాలో మునిగిపోయాడు.

కాసేపటికి కళ్ళుతెరిచి, ఆ ముసలాడు సుబ్బారావుని తేరిపార చూసాడు. కృతజ్ఞతగా నవ్వాడు. నవ్వి—

ఆప్యాయంగా 'వాట్ ఈజ్ యువర్ నేమ్?' అని అడిగాడు. సుబ్బారావు కొంచెం ఆశ్చర్యపడి తన పేరు చెప్పాడు. సంభాషణ అంతా ఇంగ్లీషులోనే నడిచింది. ఆ ముసలాడు సుబ్బారావుకి థాంక్స్ చెప్పి, అక్కడ వాళ్ళంతా ఎందుకు జమయింది వివరాలన్నీ తెలుసుకున్నాడు. అతనూ నిరుద్యోగే నట! ఇరవయి సంవత్సరాల్నుంచి ప్రయత్నించి ఉద్యోగం దొరక్క ఇలాగ అడుక్కుతిని బ్రతుకుతున్నాడట. అంతా చెప్పి—

'థాంక్స్ బ్రదర్. పోతున్న ప్రాణం నిలబెట్టావు కాని ఈ ముసలిశరీరం రాత్రిళ్లు చలికి తట్టుకోలేకపోతూంది' అంటూ నిట్టూర్చాడు. సుబ్బారావు జాలి పడి తన పైమీది కండువా అతని కిచ్చాడు.

అది పుచ్చుకుని, 'వెరీ మెనీ థాంక్స్ తప్పకుండా ఇంటర్వ్యూకి వెళ్ళు, నీకు జయమవుతుంది.' అని ఆశీర్వదించి వెళ్ళిపోయాడు ముసలాడు. ఆ సంగతి అప్పుడే మర్చిపోయాడు సుబ్బారావు.

సుబ్బారావుకి ఇంటర్వ్యూ అయే సరికి రాత్రి ఏడుగంటలయింది. అతను లాస్టు కాండిడేట్! ఆ రాత్రే—పదకొండు గంటలకి బయల్దేరుతున్న 'ఈస్టు కోస్టు'లో డొంగ్రేగారి ప్రక్కనే కూర్చునివున్నాడు సుబ్బారావు, వైజాగు వెళ్తూ. డొంగ్రేగారి భుజాలచుట్టూ, సుబ్బారావు కప్పిన 'పైకండువా' వ్రేలాడ్తూవుంది. ఆ సెంటర్నుంచి నేషనల్ సర్వీస్‌కి సెలక్టయింది సుబ్బారావు ఒక్కడే!

